క్లుప్తంగా

డ్రగ్స్ నిర్మూలనపై పోస్టర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్ : డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన పోస్టర్‌ను శనివారం తిరుపతి బస్టాండ్ కార్గో సెంటర్‌లో ఆవిష్కరించారు. ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డీఆర్ నాయుడు మాట్లాడుతూ డ్రగ్స్‌కు అందరూ దూరంగా ఉండాలని కోరారు. కార్గో ద్వారా డ్రగ్స్ తరలించే ప్రమాదముందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డ్రగ్స్ రవాణాను పసిగడితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలన అధికారి కమల్‌రాజు పాల్గొన్నారు.

విద్యుత్ బస్సులు ఓ వరం



చార్జింగ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డీపీటీఓ

తిరుపతి అర్బన్ : జిల్లాకు వంద విద్యుత్ బస్సులు కేటాయించడం ఓ వరమని డీపీటీఓ వెంకట్రావ్ తెలిపారు. శనివారం ఏడుకొండల బస్టాండ్ సమీపంలోని విద్యుత్ బస్సుల చార్జింగ్ పాయింట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చార్జింగ్ పాయింట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తిరుమలకు 50, రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు 14, కడపకు 12, మదనపల్లెకు 12, నెల్లూరుకు 12 విద్యుత్ సర్వీసులు క్రమం తప్పకుండా నడపాలని ఆదేశించారు. బస్టాండ్ ఆవరణలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. కంట్రోలర్స్ నిత్యం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఏటీఎం డీఆర్ నాయుడు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



భోజనం పంపిణీ చేస్తున్న పీసీ రాయలు

తిరుపతి కల్చరల్ : ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ డాక్టర్ కుమార మంగళం బిర్లా పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం గాంధీ రోడ్డులోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో వెయ్యి మంది పేదలకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ హాజరయ్యారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయలు మాట్లాడుతూ కుమార మంగళం బిర్లా నిత్యం సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నారని కొనియాడారు. ట్రస్ట్ ప్రతినిధి మండి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం



మాట్లాడుతున్న హరిప్రసాద్

తిరుపతి కల్చరల్ : ఎల్‌బీసీ రోడ్డులోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన్‌లో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీ హ్యాండీక్రాఫ్ట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ హరిప్రసాద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఇటీవల నామినేటెడ్ పదవులు పొందిన స్థానిక నేతలను సత్కరించారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్, సంఘం నేతలు సి.వెంకటేశ్వర్లు శెట్టి, టి.రమణ, టి.సిద్దయ్య, టి.గోపాల్, మునికృష్ణయ్య, పాపయ్య, టి.జయలక్ష్మి, అల్లాభక్ష్, భాగ్యలక్ష్మి, మెహరున్నీబీ పాల్గొన్నారు.

మామిడి రైతులకు అన్యాయం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : మామిడి రైతులకు అన్యాయం జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ కిలో మామిడికి తాము రూ.4లు, ఫ్యాక్టరీ యాజమాన్యాలు రూ.8లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. ఫ్యాక్టరీల వారు కేవలం రూ.5 నుంచి రూ.6లకే కిలో కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.

రక్తదానం





స్విమ్స్ బ్లడ్ సెంటర్ వారు శనివారం పద్మావతి ఆడిటోరియంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డైరెక్టర్, వీసీ ఆర్వీ కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ ఏ,బీ, ఓ రక్త సమూహాలను కనిపెట్టిన కార్ల్ ల్యాండ్ స్టైనర్ పుట్టినరోజును పురస్కరించుకుని ఏటా జూన్ 14వ తేదీన రక్తదాతల దినోత్సవం జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. రక్తదానాన్ని ప్రతి ఒక్కరు జీవనశైలిగా మార్చుకోవాలని కోరారు. స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ, సూపరింటెండెంట్ రామ్, మహిళా వైద్యకళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ముక్తేశ్వరయ్య, డాక్టర్ వనజాక్షమ్మ పాల్గొన్నారు. అలాగే తిరుమలలోని అశ్విని ఆస్పత్రిలో 34 మంది భక్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆస్పత్రి వైద్యులు కుసుమ కుమారి, సుబ్బారెడ్డి, శోభారాణి, హెడ్ నర్స్ సావిత్రి పాల్గొన్నారు.

– తిరుపతి తుడా/ తిరుమల

గజగమనం

తిరుచానూరు పద్మావతీదేవి శనివారం గజవాహనంపై విహరించారు. అమ్మవారి జన్మనక్షత్రమైన ఉత్తరాషాడం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణముఖ కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం ఊంజల్‌సేవ చేపట్టారు. అనంతరం సిరులతల్లి తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. – చంద్రగిరి



నోటీస్ బోర్డు

- జిల్లాలోని 8 కేంద్రాలలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు.
- తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో సాయంత్రం 6 గంటల నుంచి ఎస్పీ బాలు పాటల సంగీత విభావరి.
- పుదిపట్ల రామకృష్ణ మందిరంలో సాయంత్రం 6.30 గంటలకు శ్రీమద్భాగవత సప్తాహం.
- అప్పలాయిగుంటలో శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 9.15 నుంచి 10.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, 10.30 నుంచి 10.45 గంటల వరకు చక్రస్నానం, అనంతరం రాత్రి 7 నుంచి 7.30 గంటల మధ్య ధ్వజావరోహణం.

‘సద్గమయ’ తరగతులు వాయిదా

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : టీటీడీ పాఠశాలల్లో 8,9,10 వ తరగతుల విద్యార్థులకు నిర్వహించాల్సిన సద్గమయ శిక్షణ తరగతులు వాయిదా పడ్డాయి. పరిపాలనా పరమైన కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ వెల్లడించారు. త్వరలోనే తరగతులు నిర్వహించే తేదీలను ప్రకటించనున్నట్లు తెలిపారు.

తిరుచ్చిపై శ్రీహరి విహారం



చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారు శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువజామునే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. దేవదేవేరులకు కనులపండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ జరిపించారు. అనంతరం ఉభయదేవేరులతో శ్రీహరిని తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగించారు.

నరేష్ మృతి తీరని లోటు



నరేష్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న భూమన

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ నేత సోడిశెట్టి నరేష్ రాయల్ మృతి తీరని లోటని పార్టీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో నరేష్ కన్నుమూసిన విషయం తెలుసుకుని ఆయన హైదరాబాద్ నుంచి హుటాహుటిన శనివారం తిరుపతికి చేరుకున్నారు. పద్మావతిపురంలోని నరేష్ నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ క్రమంలోనే తన మిత్రుడు నరేష్ రాయల్ ఆకస్మిక మరణంపై వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. మంచి స్నేహితుడిని కోల్పోయానంటూ భావోద్వేగానికి గురయ్యారు. నరేష్ కుటుంబీకులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.



విషణ్ణవదనంతో అభినయ్‌రెడ్డి



వందనం ఔట్!

- తల్లికి వందనం అమలులో కోతలు
- అనర్హతకు గురైన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలు
- ప్రభుత్వ వైఖరిపై ఆవేదనలో చిరుద్యోగులు
- చాలీచాలని వేతనాలతో బతుకీడుస్తున్నామని ఆక్రోశం
- ఎన్నికల హామీ నెరవేర్చకుంటే పోరాటమే శరణ్యమంటూ ఆగ్రహం

ఎన్నికల సమయంలో ఓట్ల కోసం హామీలు గుప్పిస్తారు.. గద్దెనెక్కిన తర్వాత తూతూమంత్రంగా అమలు చేసి చేతులుదులిపేసుకుంటారు. అధికారం కోసం సూపర్ సిక్స్ అంటూ ఆశలు కల్పిస్తారు.. పీఠం దక్కిన వెంటనే ఇచ్చిన మాటను తుంగలో తొక్కేస్తారు. ఇదే ఘనత వహించిన చంద్రబాబు నైజం. జనం నెత్తిన కుచ్చుటోపీ పెట్టడం మాత్రం వాస్తవం. ఇదే ఆనవాయితీని బాబుగారు మళ్లీ కొనసాగిస్తున్నారు. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15వేల చొప్పున అందిస్తామని ప్రగల్భాలు పలికారు. రూ.25వేల కంటే తక్కువ వేతనం పొందే చిరుద్యోగులకు సైతం ఈ పథకం వర్తింపజేస్తామని నమ్మించారు. తీరా అమలు చేసే సమయం వచ్చే సరికి నిజస్వరూపం బయటపెట్టారు. వందనం సంగతి దేముడెరుగు.. అందరినీ వంచించారు. తొలుత రూ.15వేలలో రూ.2వేలు కోత విధించారు. సరే ఆ రూ.13వేలు అయినా వస్తుంది కాదా అనుకుంటే అందులోనూ మాట తప్పారు. చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకొచ్చే కాంట్రాక్ట్.. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని మోసం చేశారు. తల్లికి వందన కింద నగదు పొందే వీలులేకుండా అనర్హత వేటువేశారు. దీంతో వేలాదిమంది చిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల హామీ ప్రకారం తమను అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. సర్కారు స్పందించకుంటే పోరాటానికి దిగుతామని హెచ్చరిస్తున్నారు.

– తిరుపతి సిటీ

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు	
ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న వారు:	8,765
అనుబంధ సంస్థల్లోని వారు :	7,850
విద్యాసంస్థలలో :	3,205
వైద్య ఆరోగ్య శాఖలో:	4,110
టీటీడీలో :	6.531

“

అనర్హత వేటు దారుణం



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా రూ.25వేలు కన్నా తక్కువ జీతం వచ్చే ప్రతి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికీ అన్ని సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పింది. ప్రస్తుతం తల్లికి వందనం పథకానికి చిరుద్యోగులను అనర్హులుగా ప్రకటించడం దారుణం. వచ్చే జీతాలు కనీసం కుటుంబ అవసరాలకు సైతం చాలడం లేదు. ఇప్పుడు పథకాలను కట్ చేస్తే రోడ్డు పాలు కాక తప్పదు.

– గంటికోట నాగవెంకటేష్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్

మొండి చెయ్యి చూపుతారా?



ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న చిరుద్యోగులను సంక్షేమ పథకాలకు అనర్హులుగా చేయడం దారుణం. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్న సంక్షేమాన్ని గాలికొదిలేసింది. తూతూ మంత్రంగా పథకాలను అమలు చేసే పనిలో భాగంగా తల్లికి వందనం పథకాన్ని చిరుద్యోగులకు అందించకుండా మోసం చేస్తోంది. ఇచ్చిన హామీని తుంగలో తొక్కింది. వెంటనే తల్లికి వందనం పథకాన్ని చిరుద్యోగుల పిల్లలకు అందించాలి.

– జయచంద్ర, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

జీవితాలతో ఆడుకుంటోంది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తాత్కాలిక ఉద్యోగులతో వ్యవహరిస్తున్న తీరు దారుణం. ఆప్కాస్ ఉద్యోగులను తొలగించడం, సంస్థను రద్దు చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఉద్యోగ భద్రత కల్పిస్తామన్న ఎన్నికల హామీని గాలికి వదిలేశారు. ప్రస్తుతం సంక్షేమ పథకాలకు సైతం అనర్హులను చేయడం కక్ష సాధింపు చర్యలలో భాగమే. ఈ పథకం వర్తింప చేయకుంటే ఉద్యమిస్తాం.

– చిన్నబాబు, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు

పేదలను ఆదుకోవాలి



ప్రభుత్వ, అనుబంధ సంస్థలలోనూ చిరు వేతనంతో గొడ్డు చాకిరీ చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పథకాలను ఇవ్వకపోవడం సమంజసం కాదు. వచ్చే జీతంతో పిల్లలను చదివించుకోలేక అప్పులపాలవుతున్న ఉద్యోగులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించకపోతే పరిస్థితి దారుణంగా తయారవుతుంది. తల్లికి వందనం తక్షణం తాత్కాలిక ఉద్యోగులకు అందరికీ ఇవ్వాలి

– ఎం.మంజుల, జిల్లా జేఏసీ ఈసీ సభ్యులు

ఆందోళన తప్పదు



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడం లేదు. తాత్కాలిక ఉద్యోగులకు ఇచ్చి మాట ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాల్సి ఉంది. ఊసే ఎత్తకపోగా ఆప్కాస్‌ను రద్దు చేస్తామంటూ బెదిరింపులకు దిగుతోంది. అరకొర జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్న చిరుద్యోగుల పిల్లలకు తల్లికి వందనం అందించకపోవడం దారుణం. సంక్షేమ పథకాలను అందించకుంటే ఆందోళన తప్పదు.

– నందకుమార్, జిల్లా జేఏసీ సహాయ కార్యదర్శి

డంపింగ్ యార్డులను క్లియర్ చేస్తాం

- ఇప్పటి వరకు 45 లక్షల టన్నుల చెత్తను తొలగించాం
- మరో మూడు నెలల్లో 35లక్షల టన్నులు తొలగిస్తాం : మంత్రి



రామాపురం వద్ద డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

తిరుపతి రూరల్, (రామచంద్రాపురం) : ఆరోగ్యకరమైన జీవితాలను అందించాలనే సంకల్పంతో మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుల నుంచి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయడం జరిగిందని మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ వెల్లడించారు. రామచంద్రాపురం మండలంలోని రామాపురం డంపింగ్ యార్డ్‌ను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది అక్టోబర్2న ముఖ్యమంత్రి చంద్రబాబు 365 రోజుల్లో 85 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. అందులో భాగంగా పలుసార్లు సమావేశాలు, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 45 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేయడం జరిగిందని, రాబోయే మూడు నెలలలో 35 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేయడానికి వేగవంతంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. తిరుపతి జిల్లా నుంచి చెత్త సేకరణకు జిగ్మా అనే కంపెనీ ముందుకు వచ్చిందని, ఆ కంపెనీ నుంచి రోజుకు 900 టన్నుల చెత్తను క్లియర్ చేస్తున్నారని చెప్పారు. అయితే రోజుకు వారు 2700 టన్నులు క్లియర్ చేయాల్సి ఉందన్నారు. మున్సిపాలిటీలో రోజువారీగా క్లియర్ చేయాల్సిన చెత్త కన్నా తక్కువ చేస్తున్నపుడు లోపం ఎక్కడ ఉందో గుర్తించడానికి ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇక్కడకు వచ్చిన తరువాత పవర్ కనెక్షన్ లేదని కంపెనీ, జనరేటర్ మీద నడుపుతున్నట్లు చెప్పారన్నా రు. ఆ సమస్యను వెంటనే క్లియర్ చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను ఆదేశించడంతో నాలుగైదు రోజుల్లో పవర్ కనెక్షన్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తిరుపతి నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల : తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో మంత్రి నారాయణ, ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ ఎస్ సుబ్రమణ్యన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీరంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించి, లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.



ఆలయం వెలుపల మంత్రి నారాయణ, సుబ్రమణ్యన్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పాకాల : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రధానోపాధ్యాయిని సుమలత తెలిపారు. శనివారం మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో యోగా రిహార్సల్ చేపట్టారు. వ్యాయామ సంచాలకుడు గణపతి మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా యోగాసనాలు వేయిస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు వనపర్తి వెంకటసిద్ధులు, సుల్తాన్, బాలాజీ, ఆదికేశవులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పళణి స్వామికి నివాళి

చంద్రగిరి : అగరాల పంచాయతీ ఉప సర్పంచ్ సుశీలమ్మ అల్లుడు పళణి స్వామి(39) అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి శనివారం అగరాలకు చేరుకుని పళని స్వామి భౌతికకాయానికి పూలమాలల వేసి నివాళులర్పించాడు. ఉప సర్పంచ్ సుశీలమ్మతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ దేవారెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

‘నీట్’గా నారాయణ జయకేతనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డీజీఎం తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : నీట్ ఫలితాల్లో తిరుపతిలోని నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ఓపెన్, వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి జయకేతనం ఎగురవేశారు. విశ్వక్ అగర్వాల్ 114వ ర్యాంకు, చప్పిడి జ్ఞానీషారెడ్డి 582, లోకేశ్వరి 1253, మానిక 1393, రామ్‌చరణ్‌రెడ్డి 1508, కీర్తి 3831, బాలాజీ 4279, ధృతి ప్రియ 4597ర్యాంకులతో పాటు 50మందికిపైగా మెడికల్ సీట్లు సాధించనున్నట్లు విద్యాసంస్థ డీజీఎం కొండలరావు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్ వేణుగోపాల్, ప్రిన్సిపాళ్లు మణికంత, సుధాకర్‌నాయుడు, ఏజీఎం చెన్నకేశవరావు అభినందించారు.